

# అద్దంమీద ఆవగింజలు


-కొనకళ్ళ వెంకటరత్న


రేడియోలో నుంచి సన్నజాజి పరిమళంలా సన్నని సంగీతం దూసుకువస్తోంది.

"అదిగో... ఆయనే!" అని సగం కలుపుకున్న పనసతొనల పెరుగు పచ్చడి వదిలేసి, ఎంగిలి చేత్తోనే వంటింట్లో నుంచి గదిలోకి ఒక్క పరుగు తీసింది సుశీల.

"ఆయనంటే?" అని ఒక చురుకైన ప్రశ్న విసిరి, ముద్దుకృష్ణ సమాధానం ఎట్లాగూ రాదని తెలుసును కనక కాచుకుని కూర్చోకుండా గబగబా సాపాటు ముగించి, చెయ్యి కడుక్కొని, టర్కీతువాలుతో మూతి తుడుచుకొంటూ, రేడియో ముందు "ప్రియే చారుశీలే. . ." అన్న జయదేవుడి అష్టపదిలో మునగానాం తేలానాం అవుతూ, మరో ప్రపంచంలో ఊపిరి తీసుకుంటున్న భార్యారత్నం పక్కని తనూ తప్పనిసరిగా ఆ గానామృతాన్ని ఆస్వాదిస్తూ నిలుచుండిపోయాడు ఒక క్షణం.

అష్టపది ఆఖరి ముక్తాయింపుతో హో ముగింపుకి వచ్చిన తరవాతకాని సుశీల ఈ ప్రపంచంలోకి ఊడిపడలేదు. ఎంగిలి చేత్తో మళ్ళీ కంచం దగ్గరికి వెడుతూ, ఎడమ చేత్తో జుత్తు ఎగసనదోసుకుని "అతనండీపాడుతున్నది... అతనూ ... మా సరళ తమ్ముడు సుధాకరం" అన్నది సుశీల.

"విన్నారు గదూ. . . ఎంత తియ్యగా, హాయిగా పాడాడోను!" అని అతని గాత్రంమీద ప్రశంసా వాక్కులు గుప్పించింది సుశీల.

అమాయికంగా ఆ పాటలో ఉన్న మెలుకువలు వివరిస్తూ అగ్గగ్గ లాడింది సుశీల.

ఆమె కళ్లలో మెరుస్తున్న ఆరాధనని గుర్తు పెట్టుకున్నాడు ముద్దుకృష్ణ.

## 2

ముద్దుకృష్ణ సౌదామినీ కళాశాలలో కొత్తగా లెక్చరర్‌గా జాయినైనాడు. కొత్తగా పెళ్లి చేసుకున్నాడు. సుశీల బి. ఎ. పాసయింది; ఆమె సౌందర్యశీలి. కట్నకానుక లంతగా లేకపోయినా ఆమెనందుకే పెళ్లి చేసుకున్నాడు. అతన్ని పెళ్లి చేసుకుని సుశీలా తనెంతో అదృష్టవంతురాలిననే అనుకుంది. కాని, ఆమెకి అప్పట్లో తెలిసిరాలేదు—ఈ పురుష పుంగవుల ఆశయాలు చిత్రంగా ఉంటాయి! ఏనుగుని తెచ్చి ఏకుల బుట్టలో పెట్టుకోవాలని చూస్తారు!

తన భార్య చురుగ్గా ఉండాలనే అనుకున్నాడు ముద్దుకృష్ణ. కాని, సుశీల మరీ చురుగ్గా ఉంది. తన భార్య తెలివితేట లయిందిగా ఉండాలనే అనుకున్నాడు ముద్దుకృష్ణ. కాని, సుశీల మరీ తెలివితేటలయిందిగా కనుపిస్తోంది. అందుచేత సుశీల ఏ మగవాణ్ణి గురించి కానీ మెచ్చుకోలుగా మాట్లాడిందో. . . అతగాడు ఉలిక్కి పడటం గమనిస్తూ వచ్చిం దామె.

సరళా, సుశీలా విశాఖపట్నంవాళ్ళు. బి. ఎ. దాకా క్లాస్‌మేట్స్‌కూడాను. సుశీలకి సరళ చాలా ముఖ్యమైన స్నేహితురాలు. అక్కడ చదువుకునే రోజుల్లో ఈ సుశీలా, ఆ సరళా, ఆవిడ తమ్ముడు సుధాకరమూ కలగాపులగంగా తిరక్కుండా ఉండి ఉంటారా? ఈ సుధాకరం అస

శెట్లాంటివాడో ఏమిటో సుశీలకి తెలియకుండా ఆరాలు తియ్యాలి అనుకున్నాడు ముద్దుకృష్ణ.

ఒక ఆధారం దొరికిందతనికి—తనతోపాటు కాలేజీలో ఎకనమిక్స్ లెక్చరర్ రామినీడని ఉన్నాడు. అతగాడు సరళాదేవికి పెనిమిటి. ఒకనాడు అతని ఇంటికి యథాలాపంగా వెళ్లినట్టు వెళ్లి, ఏదో ఒక సందర్భం పురస్కరించుకుని అతని 'ఫామిలీ ఆల్బమ్' తిరగెయ్యటంలో సుధాకరం ఫోటో అగుపించింది. ఫోటోలో అతను రూపసిగానే ఉన్నట్టు తోచింది. తనకన్న బలిష్ఠంగాకూడా ఉన్నాడు, కర్మ. ప్రసక్తానుప్రసక్తంగా సుధాకరం ఎమ్. టెక్. చదివి ప్రస్తుతం బొంబాయిలో పనిచేస్తున్నాడని తెలిసింది. ఇకనేం? చదువుకి చదువూ, రూపానికి రూపం. తూణీరంలో ఈ బాణాలు చాలక, రసనాగ్రం మీద సంగీత సరస్వతీ నృత్యమొకటి! సుశీలకి చిన్న స్నేహితబృంద ముంది. తనకి తెలుసు—వీళ్లంతా అక్కడ విశాఖపట్నంలో . . . ఛీఛిబడ్డున . . . ఇక తరవాత ఆలోచనలు ప్రమాదకరమైన వైపుగా పయనించసాగినాయి. దానికి తోడు రామినీడు ఉన్నట్టుండి—"వీళ్లందరూ అతని పాటంటే ఎంత పడి ఛస్తారనుకున్నావూ?" అని సుధాకరాన్ని అగ్గించి వదిలి పెట్టాడు. ముద్దుకృష్ణకి గుండె గుభిల్లుమంది.

'భార్యా రూపవతీ శత్రుః' అన్నారు. తను సరేసరి చదువుకున్న సుందరాంగిని కట్టుకున్నాడాయిరి! ఆమె చక్కగా పాడుతుందికూడాను!

## 3

భార్యా భర్తలిద్దరూ సరసని భోజనం చేస్తున్నారు.

"మా సరళ తమ్ముడికి సంబంధాలు చూస్తున్నారటనే శ్రీవారు?" అంది సుశీల సాభిప్రాయంగా.

"నేనా? సుధాకరానికా? సంబంధాలా? ఎవ రా చెప్పింది నీకు?"

"ఎవరో ఒకరు లెండి! తమరు పనిగట్టుకుని దర్యాప్తు చేస్తున్నారుగా—అతగాడి గుణగణాలని గురించీ, విద్యా విశేషాలని గురించీ. గుచ్చి గుచ్చి ప్రశ్నలు వేసి. . . ఈలలు తీసి. . . నాకు తెలుసు లెండి ఎందుకో ఈ ఆచోకీలు" అంది.

ముద్దుకృష్ణ ఆలోచనలో పడ్డాడు. ఈవిడ కెట్లా తెలిసింది చెప్మా? నిన్న సుసర్లవారింట్లో వాళ్లమ్మాయి సమర్తబంతికని ఈవిడా, ఆ రామినీడు భార్యా కలిశారు గావును. ఏదో సంబంధం దృష్టిలో ఉంచుకుని సుధాకరాన్ని గురించి వైనవైనాలుగా తను అడుగుతున్నట్టు ఊహించుకున్నాడు గావును ఆ మానవుడు! అతను తన భార్య చెవిలో ఊదాడు గావును. ఆవిడ ఈవిడ చెవి కొరికి ఉంటుంది బహుశా. ఈవిడేమో . . . మొన్న రేడియో పాటముందు. . . సుధాకరాన్ని గురించి పొగిడిన పొగడ్తలకి తను మోహ మెలాగో పెట్టిన సందర్భంతో జోడించి చూసుకుని కీలకం పట్టేసి ఉంటుంది. తన అనుమాన ధోరణులు ఆమెకి అవగతమైనవే కదా!

ఇక బిగుసుకుపోయి అలక పాను పెక్కుతుంది! అక్కడికీ తను జాగ్రత్తగానే దర్యాప్తులు సాగించాడు. ఇట్లా దొరికిపోయాడేమిటీ, కర్మ? ఇది మొదటి సారి కాదాయెను. రాత్రి పొలగ్గా పందించి నప్పుడు నడుము చుట్టూ చేతులు పెనవేస్తే మొరాయించింది. తెల్లవారే ఘడియలలో కాని, రాజీ కుదరలేదు. ఆ క్షణా లట్లాంటివి. పతీ పతుల మధ్య ఎన్ని స్పర్ధలు రేగినా, మిట్ట పల్లాలన్నీ చదునయిపోయే మధుర

**'నన్ను ఆడది ప్రేమించింది' అని చెప్పుకొనడానికి ఉవ్విళ్ళూరని మగవాడు ఉండడు. వాడు ఎంతటి దౌర్భాగ్యుడు అయినా - తన భార్య, తనదైన స్త్రీ ఆలోచనలు కాని, అభిరుచులు కాని తన ఆవరణ దాటి ఇతరత్రా ఒక్క పిసరు ప్రసరించినా సహించలేడు. అలాంటి అనుమానాన్ని అయినా సరే!**

క్షణాలు! మొగాడు ఇంటా, బయటా ఎన్ని ప్రగల్భాలు పోయినా, ఎంత అహం వెళ్లిబోసినా. . . గెలుచుకొచ్చిన రాజ్యాలన్నీ దోసిట్లో పోసుకుని స్త్రీ పాదాల ముందుంచి మోకరిల్ల వలసిన అమృత ఘడియలు!!

## 4

దసరా వచ్చింది. బిచ్చగాళ్లు రకరకాల వేషాలు వేసుకువచ్చి గుమ్మాల ముందు గోల చేస్తున్నారు.

"చూడ కళ్లూ లేవు నారాయణా!" అంటూ ఒకడు గోనెపట్టా మట్టగోచీ పెట్టుకుని దేకుతూ వచ్చాడు. వాడికి వంత పాడుతూ చేతికర్రతో దారి చూపుతున్నా డింకొకడు.

"ఒరేయ్! కన్ను గుడ్డయితే దేకడమెందుకూ?" అని కసిరాడు, ముందు గదిలో క్వార్టర్లీ పరీక్ష పేపర్లు ముందేసుకుని కూర్చున్న ముద్దుకృష్ణ.

"ఏదో కూటికోసం కోటి విద్యలు" అని జోలిలో నాలుగు గింజలేసి చక్కాపోయింది సుశీల.

"ఏమి జల్మం బేమి జీవనమూ" అంటూ ఇద్దరు సాధువులు వచ్చారు—మొహాన్ని విభూతి పెంకెకట్లూ, కాషాయి గుడ్డలూ, చేతిలో దండమూ, కమండలమూ.

"రోగమా? కూలిపని చేసుకోరాదూ?" అని జయ్యి మన్నాడు ముద్దుకృష్ణ.

"అబ్బ దేనికండీ ఆ చిటపటలు? కాస్సే పరిచి వాళ్లే పోతారు. కూలి పని మహా సులభంగా ఉన్నదా ఏం? కూలీ పీడికన్న అధ్వాన్నంగానే బ్రతుకుతున్నాడు. కాబట్టే అది వదిలి దీనికి తల ఒగ్గారు వీళ్లు. నిక్షేపంగా అడుక్కోనివ్వండి వాళ్ని. బ్రహ్మంగారి తత్త్వాలూ గట్టా విని, మనస్సు కరిగితే ఒక పైసా రాల్చండి. శరీర మనిత్యమని వాళ్లు మహీమకికీ ఘోష పెడుతూనే ఉన్నారు, పాపం" అంది సుశీల వంటింట్లోనించి.

అంతలో ఆటొకడు తాళమూ, ఇటొకడు మద్దెలా వాయిస్తుండగా ఒక్క పెట్టున ఫెళఫెళమన్నట్టు తెయ్యి మని ఆడిం దొక బొమ్మ.

పొంగారి ఉన్న బుగ్గలు, మెడమీద సన్నని గీరలు, ఉబికిన వక్షస్సు. . . పడుచుతనపు బింకానికి తోడు కోటామీద ఉన్నదేమో నీరెండలో మెరిసిపోతూంది — సీతాకోక చిలకలా, నీళ్లమీద చిల్ల పెంకులా, పల్లటీలు కొడుతున్న పావురాయిలా అడుగు వేస్తూంది పిల్లముండ! పిరుదు లెగరేస్తూంది. నడుము జవజవ లాడిస్తూంది. మొగాడి నరాల్ని ఫిడేలు తీగల క్రింద మార్చి, కమాను కర్రల్లే ఒళ్లు తిప్పుకోనూ, ఎత్తుపల్లాలు బహిర్గతమయ్యేలా ఒంపులు తిరగనూ. . . వీళ్ల దుంపతెగా సినిమాలు చూచి వీళ్లూ నేర్చుకుంటున్నారు అనుకుని ఒక పావలాకాసు దాని మొహాన్ని పారేశాడు ముద్దుకృష్ణ.

డబ్బందుకుని కాళ్లగజ్జెలు ఘల్లు ఘల్లుమంటూ అది చీడీలు దిగిందో లేదో వెనక్కి తిరిగి చూశాడు.

కిసుక్కున నవ్వి వంటింట్లోకి చల్లగా జారుకుంటూంది సుశీల.

ఎప్పు డొచ్చిందో ఏమో. . . ఇందాకటినించీ వెనకాలే నిలబడింది గావును కుర్చీమీద చేతు లాన్చి. తను గమనించనే లేదు.

భోజనం చేస్తూ, "పిల్లముండ బాగానే 'డాన్సు' చేసింది గదూ?" అన్నాడు ముద్దుకృష్ణ.

"దాని పిండాకూడు. . . దాన్ని బజార్లో గంతు లేయించి ఆ ఇద్దరు ముండాకొడుకులూ బాగానే దండుకుంటున్నారు" అని ప్రీతిగా నవ్వింది సుశీల.



"నువ్వు రోజా ఇంటికి ఇన్ని ఫైళ్లు మోసుకు పోతున్నావు — మరి ఒక్కసారైనా ఇంటి దగ్గర డిస్పోజ్ చేసినట్లు కనపడదేమోయ్?"
"డిస్పోజలు కోసమటోయ్ నేను రోజా ఫైళ్లు మోసుకువెళ్లేది?"
"మరి?"
"మీ అల్లుడుగారు చాలా కష్టపడి పనిచేస్తున్నారు. రోజా ఫైళ్లు మోయలేక చాలా బాధపడుతున్నారు. ఒక స్కూటర్ కొని ఇవ్వు, నాన్నా—అని మా ఆవిడ చేత మా మామగారికి రికమెండ్ చేయించుకోవడానికి!"

## 5

సెలవులకి ఇటుకేసి వచ్చినట్టున్నాడు. సుధాకరానికి కాలేజీ స్టూడెంట్స్ కల్చరల్ యూనియన్ వాళ్లు ఆంధ్ర వారోత్సవాల సందర్భంలో సన్మానం ఏర్పాటు చేశారు.

ముద్దుకృష్ణ ఎంత పింగటించినా గానకచేరీకి రానుగాక రానంది సుశీల.

"నేను అనుమానాలతో వేగిపోతున్నాననా?" అని నవ్వాడు ముద్దుకృష్ణ.

"అబ్బ! నన్ను రెచ్చగొట్టకాకండి. నేను మెచ్చేదీ, నాకు నచ్చేదీ—సుధాకరం గొంతు, సుధాకరం కాదు. అది తెలుసు కోండి. ఈ వేళ అతని పాట ఎ. ఐ. ఆర్. వాళ్లు టేప్ రికార్డ్ చేస్తారుట. అతని కచేరీలు తరుచు ప్రసార మవుతూనే ఉంటాయి. అవన్నీ రేడియోలో విన గలను: వింటున్నాను; వింటాను. మీకు మల్లే మనిషి, మొహమూ, ఒళ్లూ చూస్తేనేగాని తీరని కళాపిపాస ఏం కాదు నాది" అని ఒక్క విసురు విసిరింది సుశీల.

"నాకు మల్లేనా?" అని సీరియస్సయిపోయాడు ముద్దుకృష్ణ.

"అవును. మీకు మల్లేనే!"

"నాకు కవిత్వపు పిచ్చీ, సంగీతపు పిచ్చీ అస్సలు లేవు."

"కాని, నాట్యకళంటే తమకి చాలా అభిమానం లేండి" అంది సుశీల వెటకారంగా.

"అట్లాంటిది మొదలే లేదు."

"అయ్యో!. . . మరిచిపోయారు గావును. . . నిన్న పావలా ఖరీదు చేసే కళారాధన తొణికిసలాడింది మీ కళ్లలో. జ్ఞాపకం తెచ్చుకోండి."

గతుక్కుమన్నాడు ముద్దుకృష్ణ.

నిన్న కుర్చీ వెనకాల గుట్టుచప్పుడుగా నిలుచుని ఈవిడ సాగించిన సి. ఐ. డి. వ్యవహార మిదన్న మాట! తనకే తెలియని ఒకానొక దౌర్బల్యం ఆమె కంట పడింది. ఇట్లా దొరికిపోయాడేమిటి తనూ? ఛేస్. . .

అక్కడికీ పుంజుకుని, తక్షణం వెన్ను చూపినట్టయినా తరుముతుందన్న భయంతో కాలు నిలదొక్కుకుని, "ఛట్— దానిని వదిలించుకుందామని ఇచ్చాగాని పావలా. . . దాన్ని మోహించా ననుకుంటున్నావా?" అని ఏదో నసిగేల్ల ఓ్రటివ్వామనుకున్నాడు ముద్దుకృష్ణ.

ఆమట్నే మాట తుంచేసి, "చాల్ చాలుగాని ఊరుకోండి, ఎవరయినా వ్యాపోగలరు. నిండా ఇరవయ్యేనిమి దేళ్లు ఒంటిమీద కొచ్చినై. ఏరి కోరి చేసుకున్న భార్య ఇంట్లో రెడీగా ఉండెను. ఒక కుర్రముండ ముందుకొచ్చి ఒక కుప్పిగంతు వెయ్యగానే. . . అంత నిక్కి నిక్కి, మిర్రి మిర్రి చూడాల్నా? డమ డమాల బండి కనపడగానే ఠక్కున ఆగిపోయే కుర్రకుంక నయమే! పరాయి ఆడది ఒళ్లు విదిలించిందే చాలని, ఒళ్లంతా కళ్లు జేసుకుని మింగెయ్యాలా అంతగా? అంత అలా కోరికలు నాలికలు సాచి కొండముచ్చులై చెలరేగాల్నా? నరాలలో పుట్టిన కండూతికా, నాట్యకళకా నిన్న మీ రిచ్చిన పావలా? గుండెల మీద చేయి వేసుకుని చెప్పండి. మీ చదువూ, సంస్కారమూ అన్నీ ఏమయి నయ్యని? కాలేజీలో చిన్న సన్నాసులికి నీతులు చెప్పాలిసిన ఉద్యోగమే మీది! పైగా తగుదునమ్మా అని చెప్పొచ్చారా నాకు? దాని డాన్సు బాగుందట—డాన్సు! సిగ్గు లేదూ? అవున్లెండి. ఎదగొడ్డుకి బెదు రుండదు" అని, తూటా లయి పోయినాయి గావును, పైట నడుముకి చుట్టుకొంటూ వంటింట్లోకి వసాృదులా వెళ్లిపోయింది సుశీల. స్టెన్ గన్ పేల్చిన తరవాత క్రొంచిలలో దాక్కుందుకు గిరుక్కున వెనక్కి తిరిగే సిపాయిపో జది.

"అయితే. . . ఏదో అడుక్కుంటున్న దని ఇచ్చాగాని. . . ఆ పిల్లముండ నదురుగాఅగుపించిందనిఇచ్చాననంటావా?" అని బేలగా నవ్వేశాడు ముద్దుకృష్ణ.

"సందేహం కూడానా? ఏ గాలి కా చాప ఎత్తకండి, మరి. ఒక అబద్ధం కప్పెట్టాలె నంటే. . . దానికి పది అబద్ధాలు చోటు పెట్టాలి. అంతకు క్రితమొక గుడ్డోడు వచ్చాడు. ఒక కుంటాడు వచ్చాడు. ఎవరికయినా ఒక్క పైసా వేసారా తమరు? పోనీ, వాలు గ్గింజలు వెయ్యమని నాకు పురమా యించారా? అది వచ్చి పైట వొసిలించి, పక్క లెగరెయ్యగానే ఎక్కడ లేని కళా రాధనా పొడుచు కొచ్చిం దయ్యగారికి! పావలా ఎత్తున ధర్మచింతన పలపల మని పొంగులు వారింది శ్రీవారికి!! చేసిన తప్పు చెయ్యలేదని బుకాయిస్తే. . . ఒకటికి రెండు తప్పు లయ్యేను!" అని మళ్లీ ముగ్గులోకి దిగింది.

ఆ దాడికి తట్టుకోవడం కష్ట మని పించింది ముద్దుకృష్ణకి.

"నీ కిప్పుడు నచ్చజెప్పలేనులే" అని లుంగీ, బనీనూ, తువాలూ వేసుకుని పక్కింటి ఇంజనీర్‌గారితో అర్జెంట్ పనేదో ఉన్నట్టు ఉడాయించేస్తూ— "అయితే, సుశీ, ఏదో సర్వసాధారణమైన ఒకానొక దౌర్బల్యానికి ఒక్క క్షణం లోనయ్యానే అనుకో. . . ఇప్పు డేమంటావు?" అని తల వంచుకున్నాడు ముద్దుకృష్ణ.

"కరెక్ట్! అలా దారికి రండి. కాని, అలాంటి దౌర్బల్యమే నాలో మీకు కనుపించిననాడు మీరు సహించగలరాని? ఆలోచించి చెప్పండి దయచేసి. నన్ను క్షమించమని కోరనున్నాండీ. క్షమించ గలరాని? అదీ నాకు కావలసింది" అని ఒక కొంటెనవ్వుతో నిలేసిం దతన్ని.

"నువ్వు అట్లాంటి కొంటెకోణంగి చేష్టలు చెయ్యవు గదోయ్" అని సిగరెట్టు ఒక దమ్ము పీల్చి సుశీల మీదికి వదిలాడు ముద్దుకృష్ణ.

"ఏమో ఎవరు చెప్పగలరు? ఆ సుధాకరమూ, నేనూ. . . అక్కడ విశాఖపట్నంలో. . ." నాన్చేసింది సుశీల.

వెళ్లిపోతున్నవాడల్లా. క్షణ మాగి, "అమ్మాయ్. . . చాలా ప్రమాదకరంగా మాట్లాడుతున్నావు. . . జాగ్రత్త" అని బుంగమూతి పెట్టి, సగం సీరియస్‌గా, సగం నవ్వుతాలుగా ఒక రిమార్క్ వదిలి చల్లగా జారుకున్నాడు ముద్దుకృష్ణ.

## 6

పొద్దు పొడిచిందో లేదో. . . గేటు కటూ ఇటూ విచ్చిన మెట్టతామర పువ్వులమీద తేనెపిట్టలు వాలినాయి. ఇరుకైన ఆ పూలగొట్టాలలోకి సన్నగా, పొడుగ్గా ఉన్న చంచువులు దూర్చి ఒక్కొక్క పిసరే తేనెలు చేదుకొంటూ, ఒక పుష్పం మీద వించీ ఇంకొక పుష్పంమీదికి వాలుతూ పోతున్నాయవి.

ముందుగదిలో ఎవరితోనో మాట్లాడుతూ కూర్చున్నాడు ముద్దుకృష్ణ.

వంటింట్లో ఉల్లిపాయా, బంగాళాదుంపలూ తరిగి, ఉప్మాకని జీడిపప్పు పలుకులు వలుస్తూంది సుశీల.

ఇద్దరికి కాఫీలు పట్టమ్మని సంకేతంగా రెండు సార్లు టేబిల్ మీద కాలింగ్ బెల్ నొక్కాడు ముద్దుకృష్ణ.

ట్రే తీసుకెళ్లి, 'టీపాయ్' మీద కాఫీలు ఉంచి వెళ్లిపోతూంది సుశీల.

"అరె...పలకరించకుండాపోతావేమిటి? నీ రెవరనుకుంటున్నావు?" అని నిలేశాడు ముద్దుకృష్ణ. లోపలికి వెళ్లిపోతున్నదల్లా చటుక్కున ఆగి, గుమ్మాని కున్న కర్టెన్ తొలగించి, నమస్తే చెప్పి, "క్షమించండి. మిమ్మ ల్నెప్పుడూ చూడ లేదండి" అన్నది సుశీల నవ్వుతూ.

అతను లేచి నించుని, "వారు న న్నెప్పుడూ చూడలేదు గదండీ— నా చదువంతా బెనారస్‌లో నడిచింది" అని సుశీల వంక తిరిగి, "నేను సుధాకరాన్నండీ. మీ సరళ తమ్ముణ్ణి" అన్నాడు.

సుశీల బిత్తరపోయింది. ఆమట్నే కళ్లింత జేసుకుని, "మీరా? కూర్చోండి. మా సరళని వెంటబెట్టుకుని వస్తే, ఫలానా అని అనుకునేదాన్ని. మీ సంగీతమంటే నాకు చాలా ఇష్టమండి" అంది నంగినంగిగా.

"అని మా అక్కయ్యా చెప్పింది గానండి— నాకు నమ్మకం లేదు లెండి" అన్నాడు సుధాకరం.

"ఏమండీ?"

"అదే నిజమయితే నా కచేరీకి రాకుండా ఉండేవారా నిన్న? మా అక్కయ్య చెప్పింది లెండి—మీ ఇద్దరూ రాలేదని."

"నిన్న మా వారేమో బిలియర్డ్సు మాచ్‌లో చిక్కడిపోయారు లెండి. కరపత్రంలోనేమో మీ కచేరీ ఒక గంటే అని ఉంది. అందుచేత. . . చూచి చూచి. . . ఒక్కతెనీ రావాల్నంటే. . . ఏదో నిరుత్సాహంగా ఫీలయి ఉండి పోయాను. క్షమించండి. పోనీ, మా సరళయినానన్ను తోడుకుపోకూడదూ?" అని కర్టెన్ వేసి లోపలికి చక్కా పోయింది సుశీల.

'ఇంతకీ వీళ్లిద్దరికీ మొహమెరికయినా లేదన్న మాట ఇంతవరకూ!' ముద్దుకృష్ణ నిర్ఘాంతపోయి కూర్చున్నాడు.

ఇద్దరూ చాలా సేపు ఇష్టాగోష్ఠిగా మాట్లాడుకున్నారు.



భార్య — "నాతో చెప్పకుండా మీకు గుండా చెరువా?"
పందెం కట్టి రంగంలోకి దూకడానికి

వెళ్ళిపోతున్నాడు సుధాకరం.

సొట్ట బుగ్గలూ, అట్ట గట్టుకు పోయిన క్రాపూ... ఒక అందం లేదు, చందం లేదు సరిగదా... అపరి శుభ్రంగా ఉన్నాడే! ఆ నడక... కొక్కిరాయి నడక... లొట్టిపిట్టలా ఉన్నాడు మనిషి!

మరి రామినీడు ఇంట్లో ఫోటో చూచినప్పు డంత అందంగా అగుపించా డేమిటి చెప్మా? కొందరి అదృష్ట మేమో! చూట్టానికి అందవికారంగా ఉన్నా, ఫోటోలో మటుకు రూపసిగా, కళ్లకి నిండుగా అగుపిస్తారు. వాళ్లకి ఇంగ్లీషులో 'ఫోటోజెనిక్' ముఖబింబం కలవాళ్లని పేరు ఉండనే ఉంది. కాగా, అనుమానం పెనుభూత మన్నారు. తను సుధాకరం రూపురేఖా విలాసాల్ని గురించి ముందస్తుగానే కొన్ని పెద్ద అంచనాలు వేసుకుని ఉన్నవిమీదట... ఆ ఫోటోలో లేని అందచందాలు తన కంట్లో దూరి వయ్యేమో గోల!

'ఇట్లాంటి మనిషిని సుశీల ప్రేమిం చేసిందేమో కొంపతీసి...' అని తను మల్లగుల్లాలు పడిపోయా డిన్నాళ్లూ!

గబగబా లోపలికి దూసుకువెళ్లి, "ఈ మనిషినా నలకూబరుడనీ, నవ మన్మథుడనీ, స్ఫురద్రూపి అనీ వర్ణించి చెప్పి నన్ను ఉడికించావూ?" అని చెవులు మెలేశాడు సుశీలని పట్టుకుని.

"ఉండండి, ఉండండి... నే నసలు అత న్నింతవరకూ చూడందే... అతని రూపం కల్పన చేసి అల్లరి పెట్టాలని అపురూపంగా వర్ణించి చెప్పా నంతే మీకు. ఇప్పుడయినా అతని మీద నాకు పూజ్యభావం నిజంగా తగ్గలేదు. చెరుకు వంకరయితే తీపి వంకరా?" అని నవ్వేసింది సుశీల.

'అమ్మయ్య! తుఫాను వెలిసింది' అను కున్నాడు ముద్దుకృష్ణ. ఏదో పెద్ద రిలీఫ్ వచ్చినట్టు ఉత్తేజం పొందు తున్నాడు పైగా. సుశీల గుర్తు పెట్టు కుంది.

## 7

గదిలో అగరువత్తుల స్టాండ్ మీద సాంబ్రాణిపుల్లలు వెలుగుతున్నాయి.

వెనకాలే వచ్చాడు ముద్దుకృష్ణ. ఆమె భుజాలమీద చేతులు ఉంచి గిర్రున తిప్పి తన మీదికి తీసుకుని తలంతా చెరిపేశాడు. భుజాలు పట్టు కుని కుదిపేశాడు. గెడ్డం ముని వేళ్లతో పైకెత్తి, "అయితే నా మీద కోపంతోనే కదూ నిన్న నువ్వు గానకచేరికి వెళ్లందీ? నిన్ను వెళ్లవద్దన్నానా? అంత అన్యాయాని కొడిగడతానా?" అని కళ్లలో కళ్లు పెట్టి చూశాడు.



రేకుల్ రేకులుగా ఫోటో— ఎస్. రామయ్య (హైదరాబాద్)

"అధికారానికి అంతా హక్కేగాని అన్యాయ మెక్కడిది లెండి. ఇంతకీ... మమత అందుకువే మహారాజులు మీరు! తమకి చికాకుగా ఉన్నప్పుడు అసెంటా ఉండాలి. ఖలాసా రేగినప్పుడు దగ్గరికి చేరాలి. ఎంత చనుమాన మున్నా, ఎన్నాళ్ళ హృదయాలు పంచుకుని సంచ రించినా... మళ్లీ అనుమానాల కేం తక్కువ లేదు. ఘడీఘడీకీ 'నేను బుద్ధిమంతురాలినే స్మండి' అని బుజా వులు చూపాలి. 'నా గత చరిత్రలో ఎవరి అడుగు ముద్రలూ పడలేదు స్మండీ... నా మనస్సెప్పుడూ ఖరాబు కాలేదు స్మండి' అని దాఖలాలు ఎప్పటి కప్పుడు రెడీగా ఉంచుకోవాలి. అవసరమైతే అగ్నిప్రవేశాలు చేసి నిదర్శనాలు చూపాలి." ఇలా సాగిపోయింది సుశీల సాధింపు.

"ఇంతకీ మొన్న గానకచేరీ కెందు కెళ్లలేదూ అని కాదూ మీ రంటున్నది? నిజంగా వెళ్లాలని నా కంత ఉబలాట మేం కలగలేదు. నమ్మండి, నమ్మకపొండి. మీరు నమ్మరు లెండి. నాకు తెలుసును."

"ఎందుకు నమ్మనూ?"

"అవును, మీలో మకిలి ఉంచు కుని నాలో మకిలి లేదంటే ఎట్లా నమ్మ బుద్ధవుతుంది? మీరుమటుకు పలచని పైటలతో పుష్టిగా, బొద్దుగా ఉన్న సినిమాతారల బొమ్మలున్న కాలెం డర్లు గదిలో చుట్టూ వేళ్లాడ గట్టుకున్నా, సినిమా చూస్తున్న ప్పుడు రిజర్వ్ సీట్లలో సుందరాంగు లెవరేనా ఉన్నారేమో నని మెక్కీ తిరిగి వెక్కి వెక్కి చూచినా, నని గట్టుకుని సైకిల్ దిగి ఇంగ్లీషు సినిమాతారలకు గోడంమీద అతికించిన దొరసాన్ల దిగంబర చిత్రాలు కళ్లతో పీల్చేసిగాని కదలక పోయినా... అవన్నీ ఏదో చిలిపిచేష్టల కిందా, శ్రీవారి రసికత్వం కిందా లెక్క వేసుకుని సహించి ఊరుకోవాలి. మేము మాత్రం ఫలానా గాయకుడి పాట ఇంపుగా ఉన్నదని నోరు జారామా... ఫలానా కవి కవిత్వం సొంపుగా ఉంటుం దని మెచ్చుకోలుగా ఒక్క మాట అల వోకగా వదిలామా... మేము పతనమై పోయినట్టే జమ. మా శీలం కళంకితమై పోయినట్టే రూఢీ. మా మనసులూ, కోర్కెలూ అన్యాక్రాంత మయిపోయినట్టే లెక్క వ్యవహార్త మంతా మొగాళ్లయినారు గాబట్టి మీ ఆట లిట్లా సాగుతున్నాయి లెండి. స్త్రీ సంపాదకులూ, స్త్రీ డైరెక్టర్లూ బయలుదేరాలి. అప్పుడు బనీన్లు లేకుండా ఛాతీలు బహిర్గతం చేసే, పిక్కల బిగువు కనుపించేలా పలచని నిక్కర్లు తొడిగి మొగతారల్లని వెండితెర కెక్కిస్తే, మగసిరి ఒలికే విగ్రహాల్ని 'సెక్స్ అపీల్' వచ్చే పోజుల్లో పత్రికల మీద ముఖచిత్రాలుగా అచ్చు గుద్దిస్తే, వయసులో ఉన్న ఆడపిల్లలూ, పెళ్లికాని కన్నెపిల్లలూ... లాలసగా బూతుబొమ్మలున్న పుస్తకాలూ, సిని మాలా గుక్కిళ్లు మింగుతూ ఎగబడి చూస్తుంటే... అప్పుడుగాని తెలిసి రాదు పురుషపుంగవులకి! అశ్లీలతా అసభ్యతా అటూ ఇటూ ఆడా మొగా అందర్నీ పరివేష్టించంగా చెరుస్తాయని! ఇప్పుడు మొగరాజుల ఆధ్వర్యంలో వ్యవహారాలు నడుస్తున్నాయి గాబట్టే... తెంపు లేకుండా విశృంఖలంగా... ఆడబొమ్మల్ని బట్టలు వలిచి చూపిస్తు న్నారు. ఆడదాని ఒంపులన్నీ స్ఫుటంగా కనుపించేలా నృత్యం చేయిస్తున్నారు. రేపు ఆడదాని కంట్లో కామాన్ని రెచ్చగొట్టేలా పురుష విగ్రహాల్ని తెరకెక్కించి డబ్బు చేసుకునే ఆడ డైరెక్టర్లు బయలు దేరాలి. అప్పుడు కుదురుతుంది రోగం. ఈ వేళ అన్నయ్యా, తమ్ముడూ బూతు బొమ్మలు చూచి చెడిపోతాం టే... చీమ కుట్టడం లేదు అయ్యలకి. రేపు అక్కా చెల్లీకూడా చెడే పరిస్థితి వచ్చిందా... అప్పుడు వెక్క పుట్టు కొస్తుంది!"

'అయిందా ఉపన్యాసం?' అన్నట్టు చూచాడు ముద్దుకృష్ణ.

వటపత్రశాయి పోజులో కాలుమీద కాలు వేసుకుని, "అయితే, నే నేదో పనిగట్టుకుని సినిమాతారల బట్టలు ఒసిలించి డాన్సులు చేయిస్తున్నానని నీ తాత్పర్యమా, రాణీసాహెబ్?"

"మీ రంటే మీరు కాదు, మీ జాతి; మొగజాతి!" అంది సుశీల కసిగా.

"అదిగో... ఆ జాతి వైషమ్యాల మంచి నన్ను మినహాయించాలెనమ్మాయ్!" అని ఆమెని పరుపు మీదికి లాక్కుని కౌగిట్లో బిగించాడు ముద్దుకృష్ణ.

"ఏం? మిమ్మల్ని మాత్ర మెందుక

